క్లుప్తంగా

పెండింగ్ డీఏ విడుదల చేయాలి


సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

కోరుట్ల: పెండింగ్ డీఏలను సత్వరమే విడుదల చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య డిమాండ్ చేశారు.కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేట, చిన మెట్‌పల్లి, వెంకటాపూర్, నాగులపేట పాఠశాలల్లో బుధవారం పర్యటించి సభ్యత్వ నమోదు చేశారు. ఆరు నెలలకు ఒకసారి నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నందునా దానికి అనుగుణంగా ఉద్యోగ,, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏలను ఎప్పటికప్పుడు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం తమను తీవ్ర నిరాశకు గురిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షులు అందె శివప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిపై విచారణ


విచారిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని సిగ్మా ఆస్పత్రిలో ఇటీవల రాయికల్ పట్టణానికి చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తి మృతిచెందగా, వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని బంధువులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో వైద్యశాఖకు ఫిర్యాదు చేయగా బుధవారం డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ బంధువులతో విచారణ చేపట్టారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి


బోధన కృత్యాలు పరిశీలిస్తున్న ఎస్సై, ఎంఈవో

పెగడపల్లి: విద్యార్థుల్లో విద్యతో పాటు సృజనాత్మకతను పెంపొందించాలని ఎస్సై కిరణ్‌కుమార్, ఎంఈవో సులోచన అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలస్థాయిలో నిర్వహించిన బోధనాభ్యాసన కృత్యాల మేళాను ఎస్సై సందర్శించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు తయారు చేసి ప్రదర్శించిన బోధన కృత్యాలు ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లలిత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, పీఎస్, యూపీఎస్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

యూరియా బ్లాక్ దందా అరికట్టాలి


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కోరుట్ల: యూరియా బ్లాక్ దందాను అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి నాయక్ కోరారు. బుధవారం మాట్లాడుతూ, రాష్ట్రానికి వచ్చిన యూరియా సరిపోక రైతులు ఇబ్బందులు పడుతుండగా కొంత మంది బ్లాక్‌లో అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఈ విషయంలో ఏలాంటి పట్టింపు చూపకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచి బ్లాక్ దందాను అరికట్టాలని డిమాండ్ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సారంగాపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధారెడ్డి అన్నారు. బుధవారం సారంగాపూర్ ఎస్సీ కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇంటింటి తిరిగి జ్వరాలపై సిబ్బంది సర్వే నిర్వహించారు. దోమల ద్వారా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులు చర్యలు తీసుకోవాలని సూచించారు. శిబిరంలో సీహెచ్‌వో కుద్దూస్, సూపర్‌వైజర్లు కిషోర్, తార, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చదువుకోసం వరద దాటాల్సిందే

- భారీ వర్షాలకు నీట మునుగుతున్న మోడల్ స్కూల్ రోడ్డు
- ఏటా ఇదే తంతు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- హైలెవల్ వంతెన నిర్మించాలంటున్న విద్యార్థులు


మోడల్ స్కూల్ రోడ్డు నీటమునగడంతో వరదనీటిలోంచి దాటుతున్న విద్యార్థులు

మల్లాపూర్: చినుకు పడిందా... బడి గోవిందా అన్న చందంగా మారింది మల్లాపూర్ మోడల్ స్కూల్ పరిస్థితి...

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ రోడ్డు వర్షం కురిసిందా నీటమునుగుతోంది. దీంతో ఆ రోడ్డు వైపు ఉన్న పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు మోడల్ స్కూల్‌కి వెళ్లే అధ్యాపకులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో మోడల్ స్కూల్ విద్యార్థులకు పెనుప్రమాదం తప్పింది. భారీ వర్షాలకు మోడల్ స్కూల్ రోడ్డు పూర్తిగా నీటమునిగి ఉధృతంగా ప్రవహించింది. ఇలాగే ప్రతీ ఏడు వర్షాకాలంలో కురిసే భారీ వర్షాలకు మోడల్ స్కూల్ రోడ్డు పూర్తిగా నీటమునగడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, యువకులు, తల్లిదండ్రులే ఆ ప్రవాహంలో వారధులుగా నిలబడి విద్యార్థులను సురక్షితంగా రోడ్డు దాటించడం పరిపాటిగా మారింది. 2013లో మోడల్ స్కూల్ ప్రారంభమయినప్పటి నుంచి ప్రతీ ఏటా వానాకాలంలో ఇదే పరిస్థితి.. కురిసే వరద ఉధృతికి రోడ్డు దెబ్బతినడం, మళ్లీ తాత్కాలికంగా మరమ్మతులు చేయించడంతోనే ప్రజాప్రతినిధులు, అధికారులు సరిపుచ్చుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపక పోవడంతో ఏటా వర్షాకాలంలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆదివారం కురిసిన వర్షానికి మోడల్ స్కూల్ రోడ్డు మళ్లీ నీటమునిగింది. రోడ్డు దాటేందుకు భయపడి విద్యార్థులు ఇంటి దారి పట్టారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో పాటు కొంతమంది విద్యార్థులు మాత్రం నీటిమునిగిన రోడ్డు వెంట జాగ్రత్తగా దాటి వెళ్లారు. మోడల్ స్కూల్ రోడ్డును అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో ఆ రోడ్డు వెంట స్కూల్‌కి వెళ్లేందుకు విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదో విధంగా స్కూల్‌కి పంపితే .. వర్షం పడి మళ్లీ ఆ స్కూల్ రోడ్డు నీటమునిగితే మా పిల్లల సంరక్షణ బాధ్యత ఎవరూ తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఏదైనా ప్రాణనష్టం జరిగితేనే స్పందిస్తారా.. అంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

దాటాలంటే భయమేస్తోంది



వానాకాలంలో మోడల్ స్కూల్ రోడ్డు నుంచి వెళ్లాలంటే భయమేస్తుంది. ప్రతీ ఏడాది వర్షం పడ్డదంటే మోడల్ స్కూల్ రోడ్డు పై నుంచి వాననీరు వస్తోంది. గతంలో కూడా భారీ వర్షాలకు మోడల్ స్కూల్ రోడ్డు మునిగిపోయింది. అప్పుడు మా స్కూల్‌కి లోకల్ హాలీడే ఇచ్చారు.

– చైతన్య, విద్యార్థిని, మోడల్ స్కూల్

వరద వస్తే ఇబ్బంది



వర్షం కురిసినప్పుడల్లా మోడల్ స్కూల్ రోడ్డు నీటమునిగిపోతోంది. ఆ రోడ్డును దాటేటప్పుడు నీటిలో జారి పడిపోతుంటే మా సార్లు పట్టుకుని జాగ్రత్తగా దాటిస్తున్నారు. మా బాధలు తప్పలంటే మోడల్ స్కూల్ రోడ్డుపై బ్రిడ్జి నిర్మించాలి.

– మధుమిత, పదో తరగతి విద్యార్థిని

వంతెన నిర్మించాలి



వర్షం వచ్చిన ప్రతిసారీ మోడల్ స్కూల్ రోడ్డు వరద నీటితో మునిగి రోడ్డు దెబ్బతింటుంది. ఈ రోడ్డుపై నుంచి రావడానికి విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బంది పడుతున్నారు.కల్వర్టు లేదా వంతెన నిర్మాణం చేపడితేనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– భూమేష్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, మల్లాపూర్

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ వెంకటరమణ అన్నారు. ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు సోషల్ మీడియా ఎక్కువగా వాడుతున్నారని, విద్యార్థులు, ఉపాధ్యాయులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, డీఎస్పీ రఘుచందర్, టౌన్ సీఐ కరుణాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధర్మపురి: సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహారెడ్డి అన్నారు. స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని సైబర్ మోసాలకు గురవుతున్న వారిలో ఎక్కువ మంది యువతీ, యువకులేనని గుర్తు చేశారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఉదయ్‌కుమార్, ప్రిన్సిపాల్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ మిత్ర తదితరులున్నారు.

పెగడపల్లి: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కిరణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ మోసాల బారిన పడితే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని పేర్కొన్నారు. క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని విద్యార్థలను కోరారు. కార్యక్రమంలో ఎంఈవో సులోచన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కథలాపూర్: గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ అచ్యుత్, ఎస్సై నవీన్‌కుమార్, లెక్చరర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

కోతుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం

మేడిపల్లి: భీమారం మండలంలో రోజురోజుకు కోతుల బెడద తీవ్రమౌతోంది. ఊరిలో కుక్కలు, పంట పొలాల్లో కోతులతో ప్రజలు సతమతమౌతున్నారు. బుధవారం మండలంలోని కమ్మరిపేట గ్రామంలో తాలుక రెడ్డి అనే రైతుకు చెందిన మూడెకరాల మొక్కజొన్న పంటను సుమారు 500 పైగా కోతుల సమూహం దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేశాయి. పంటకు కాపలాగా ఉన్న తాలుక రెడ్డి ఆయన భార్యపై కోతులు దాడికి యత్నించాయి. కోతులు ఎక్కువగా ఉండడంతో చేసేదేమిలేకా చూస్తూ ఉండిపోయామని రైతుల కన్నీటి పర్యంతమయ్యాడు. రెండు నెలలుగా కంటికి రెప్పలా కాపాడుకున్న పంట తన కండ్లముందే ధ్వంసం కావడంతో రైతు రోదించాడు. పంట నష్టం సుమారు 1.5 లక్షల పైనే ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. కమ్మరిపేటతో పాటు మండల వ్యాప్తంగా కోతుల బెడదతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి కుక్కలు, కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఒడ్లపై పడేసిన కంకులు

నిరుపేదల వైద్యానికి ప్రభుత్వ సాయం


ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: నిరుపేదల వైద్యానికి ప్రభుత్వ సాయం అందిస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన ఆశా వర్కర్ మహంకాళి అశ్విని మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సీఎం సహాయనిధి నుంచి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం రూ.3 లక్షల ఎల్‌వోసీని అశ్విని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోనగిరి నారాయణ, జాగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు

ధర్మపురి: గణేశ్ నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదని పోలీసుల సూచనలు అతిక్రమించినట్‌లైతే కేసులు నమోదు చేస్తామని ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురి పోలీస్ స్టేషన్లో బుధవారం గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించుకోవాలని, మద్యం తాగి అల్లర్లకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఉదయ్‌కుమార్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

ఇబ్రహీంపట్నం: వినాయక నిమజ్జనాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీవో మహమ్మద్ సలీం కోరారు. బుధవారం మండలంలోని వేములకుర్తిలో వినాయక నిమజ్జనం చేసే ప్రాంతాలను పరిశీలించారు. గ్రామంలోని విధులలో లైట్లతో పాటు నిమజ్జనాల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఆఫీసర్ రాజ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ వినోద్, కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్ సుమన్, కారోబార్ రాజేందర్ పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలి

మల్యాల: గణేశ్ నిమజ్జనంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలనీ నీటి పారుదల శాఖ డీఈఈ తిరుపతి అన్నారు. బుధవారం మల్యాలలో వరద కాలువను పరిశీలించి మాట్లాడారు. వరద సమీప ప్రాంతాల్లో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయన వెంట ఏఈఈ అరుణకుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాది మహేష్ ఉన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీల ఎంపిక

జగిత్యాలరూరల్: మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీల ఎంపిక పొలాస ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎంఈవో గంగాధర్ తెలిపారు. పొలాస ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 9న బాలికల అండర్–14, అండర్ –17 క్రీడాకారుల ఎంపిక, 10న బాలురకు అండర్ –14, 17 ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 11న ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు కొండపల్కల కోటేశ్వర్‌రావు పీడీ అంతర్గాం 99631 59111 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కథలాపూర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం కథలాపూర్‌లో ఎస్జీఎఫ్ మండలస్థాయి క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంఈవో శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో డీఈ తనిఖీ

కథలాపూర్: మండలంలోని అంబారిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో మెట్‌పల్లి డీఈ మధుసూదన్ బుధవారం తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లోడ్ ఎంత ఉందనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోసానిపేట గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట ఏఈ భూమేశ్వర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కోరుట్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ గౌడ్ అన్నారు. బుధవారం కోరుట్లలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల నిర్వహకులు రామకృష్ణ, కరస్పాండెంట్ గాడిపల్లి హరిప్రియ–అంజయ్య, ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్‌కుమార్, కరస్పాండెంట్లు రాజేశ్, ఎంఏ భారీ పాల్గొన్నారు.

గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు


జగిత్యాలలో మహిళల కుంకుమ పూజ

జగిత్యాల/జగిత్యాలరూరల్/జగిత్యాలటౌన్/కోరుట్ల/రాయికల్/మెట్‌పల్లి/కథలాపూర్/సారంగాపూర్/ బుగ్గారం/గొల్లపల్లి/ కొడిమ్యాల/ఇబ్రహీంపట్నం/ మల్లాపూర్/పెగడపల్లి: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గణేశ్ మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమపూజలు, అన్నదానాలు చేశారు. రాయికల్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు.


మెట్‌పల్లిలో గణేశునికి సమర్పించిన నైవేద్యాలు


లక్ష్మీదేవిపల్లిలో స్వామివారికి దీపోత్సవం

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

సారంగాపూర్: గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ విధానంలో విధులు నిర్వహించే విధానానికి స్వస్తి పలకాలని గ్రామపంచాయతీ కార్మికులు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ కృష్ణారెడ్డికి వినితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా 2025 జనాభా ప్రాతిపదికన ప్రస్తుతం గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న వారి పేర్లు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసి, వేతనాలు చెల్లించాలని కోరారు. జీవో 60 ప్రకారం వేతనాలు సవరించి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు బ్యాంకు ఖాతాల్లో ప్రతి నెల 1వ తేదిన చెల్లించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పులి మల్లేశం, ఎవుసం కొండయ్య, ఉప్పులపు పోషాని, గోవర్ధన్ శ్రీకాంత్, బెక్కం లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

మల్యాల: మండలంలో నూతనంగా మంజూరైన 3 పూర్వ ప్రాథమిక పాఠశాలలను ఈ విద్యా సంవత్సరం నుంచి స్థానిక పాఠశాలల్లో ప్రారంభిస్తామని మల్యాల ఏంఈవో జయ సింహా రావు తెలిపారు. విద్యార్థులకి భోదించడానికి ముగ్గురు బోధకులు, ముగ్గురు మహిళా ఆయాలు కావాలని,స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు ఏంఈవో కార్యాలయంలో సెప్టెంబర్ సాయంత్రం 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: ప్రీ ప్రైమరీ తరగతుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి మధు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వేములకుర్తి ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ పాఠశాల, తిమ్మాపూర్ తండా ఎంపీపీఎస్ పాఠశాల, డబ్బా ఎంపీపీఎస్ పాఠశాల, ఎర్రాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలల్లో ప్రతీ సెంటర్‌కు ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులు మంజూరైనట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 6 వరకు మండల విద్యాధికారి కార్యాలయంలో అందచేయాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి వైద్యులతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్మల శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు.

దిశ కమిటీ సభ్యుల నియామకం

సారంగాపూర్: జగిత్యాల జిల్లా స్థాయి దిశ కమిటీ సభ్యుడిగా బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన పాత రమేశ్ నియమితులయ్యారు. రమేష్ బిజేపి జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇప్పటికే కొల్వాయి విండో చైర్మన్‌గా పనిచేసారు. దిశ కమిటీ సభ్యుడిగా తనను నియమించిన ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాయికల్: మండలంలోని దావన్‌పల్లి గ్రామానికి చెందిన భిక్యానాయక్‌ను జగిత్యాల దిశ కమిటీ మెంబర్‌గా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు తెలిపారు. ఈ సందర్భంగా భిక్యానాయక్‌ను మండల అధ్యక్షుడు ఆకుల మహేశ్ తదితరులు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వెల్గటూర్ : పీఆర్‌టీయూటీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందాడి శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మ్యాక శ్రీనివాస్, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రమోద్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలానికి చెందిన వడ్లకొండ నాగయ్యను జిల్లా ఉపాధ్యక్షుడిగా జయాకర్ జిల్లా కార్యదర్శిగా జిల్లా కార్యవర్గంలోకి తీసుకున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయుల కృషి ఆదర్శప్రాయం

వెల్గటూర్ : పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న ఉపాధ్యాయుల కృషి ప్రతీ ఒక్కరికి ఆదర్శ ప్రాయమని మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ అన్నారు. మండలం లోని పాశిగామ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంపత్ కుమార్, ఉపాధ్యాయుడు మహేశ్ రూ.10 వేలతో సొంతంగా ఏర్పాటు చేసిన పాఠశాల బోర్డును ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నందయ్య, సీఆర్పీ వెంకటేశ్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరికరాలను వినియోగించుకోవాలి

జగిత్యాల: దివ్యాంగులు పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో రాము అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు పరికరాలు అందించారు. ప్రభుత్వం అందిస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష కో–ఆర్డినేటర్ మహేశ్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం

బుగ్గారం: గోపులాపూర్ గ్రామానికి చెందిన సుద్దాల లింగన్న అనే వ్యక్తి అనారోగ్యంతో మరణించగా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల సుభాష్, సీనియర్ నాయకుడు బల్మూరి రామారావు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన

కొడిమ్యాల: మహాత్మ జ్యోతిరావు పూలే వ్యవసాయ కళాశాల కరీంనగర్ విద్యార్థినుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా రామకృష్ణాపూర్‌లో రైతులకు సేంద్రియ ఎరువుల వాడకం,తయారీ విధానం గురించి తెలియజేశారు. అలాగే పంచగవ్య వేపాకు కషాయం తయారీ విధానం గురించి రైతుల ముందు వివరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు ప్రణీత శృతి, శ్రావణి, దీప్తి, హరిణి, స్నేహలత రైతులు పాల్గొన్నారు.

‘అభివృద్ధిని చూసి ఓర్వలేకనే రాద్ధాంతం’

మెట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పినప్పటికీ బీఆర్‌ఎస్ నాయకుల్లో మార్పు రావడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆ పార్టీకి భంగపాటు తప్పదన్నారు. సమావేశంలో నాయకులు పూదరి నర్సాగౌడ్, జంగా స్వామి, షేక్ మహమ్మద్ పాల్గొన్నారు.